RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 265 పేజీలు - 08 గురువారం 20 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక


## ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

● బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లగలగాలి ● వారి ఆదాయం పెంచడంలో భాగస్వామ్యం కావాలి ● బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి సూచన



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో ఈ మేరకు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఓ-ఘాఓఇలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. కింద రూ.4,463 కోట్ల విలువైన

మిగతా2లో...



## ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

భూసేకరణలో బాధితులను పట్టించుకోరా..?

కళ్యాణలక్ష్మి విచారణపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలం గాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను మిగతా2లో...



## లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

అందులోనే మహిళా రిజర్వేషన్ల అమలు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ డిమాండ్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 19:** లోక్‌సభ స్థానాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యతిరేకించింది. ప్రస్తుతమున్న 543 స్థానాలనే కొనసాగించాలని, వీటిలోనే మహిళా రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. పార్లమెంటు సమావేశాల్లో పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని, ఈ విషయంలో ప్రతిపక్షాలు విజయం సాధించినట్లు భావిస్తున్నామని తెలిపింది. నీట్ వ్యవహారంతోపాటు రామమందిర

మిగతా2లో...

## సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం



- ప్రజలతో మమేకమే లక్ష్యంగా పీఏసీ సమావేశం

**తొలి అక్షరం/నిజామాబాద్, ఆగస్టు 19:** జిల్లా కేంద్రంలోని దుబ్బలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పీఏసీ సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్


మిగతా2లో...

## కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

● కోవిడ్ రికార్డుల దాపరికం నిజమేనని ఒప్పుకోలు ● నవంబర్ 12న శిక్ష ఖరారు చేయనున్న కోర్టు ● ప్రపంచవ్యాప్త తప్పిదాన్ని చైనాపైకి నెట్టే ప్రయత్నంవెల్లడవుతున్న వాస్తవాలు..అమెరికా ఫెడరల్ కోర్టులో నేరాన్ని అంగీకరించిన ఫౌచీ సలహాదారు డేవిడ్ మోరెన్స్



**తొలి అక్షరం/గ్రీన్‌బెల్ట్ (మేరీల్యాండ్),ఆగస్టు 19:** కోవిడ్ మహమ్మారి చైనా లేబొరేటరీస్ నుంచి ప్రపంచంలోకి విస్తరించిందని అమెరికా చేసిన ప్రచారం అవాస్తవమని తేలిపోయింది. తాను చేసిన తప్పుల్ని చైనా మీదకు నెట్టి, ఆ దేశాన్ని అభాసుపాలు చేయాలనే ప్రయత్నాల గుట్టురట్టు అయ్యింది. కోవిడ్ సమయంలో అంతటి దుష్ప్రచారం తమ దేశంపై జరుగుతున్నా, చైనా భవిష్యత్ కార్యాచరణపై దృష్టి పెట్టిందే తప్ప, ఏనాడు ఏ దేశాన్ని నిందించలేదు. దీనితో భారతదేశంలో కూడా చైనా లేబరేటరీల నుంచే కోవిడ్ మహమ్మారి వచ్చిందనే ప్రచారాన్ని మిగతా2లో...




## ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

## 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

● ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి ● పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి ● అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న

మిగతా2లో...

## అర్హులు ఓటరు జాబితాలో.. అనర్హులు జాబితా బయట


- ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం




## పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

సీఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు

సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ




## ప్రశ్నిస్తే..అరెస్టులా?

● మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని హౌస్ అరెస్ట్

● నివాసాల వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం దారుణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదారబాద్ సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి సందర్శనకు బీఆర్‌ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసానిని పోలీసు లు హౌస్ అరెస్టు చేశారు. కోకాపేట్‌లోని హరీశ్‌రావు నివాసం వద్ద నార్సింగి ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... ప్రశ్నిస్తే అరెస్టు చేయడం దారుణమన్నారు. కోకాపేటలోని హరీశ్‌రావు నివాసానికి నార్సింగ్ పోలీసులు వెళ్లి, వారిని బయటికి వెళ్లకుండా ముందుగానే హౌస్ అరెస్ట్ చేశారు. అరెస్ట్ విషయాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మిగతా2లో...

# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలు ఏమిటి?
గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన కొందరు తమ అనుభవాన్ని వెల్లడించారు.

---

# ప్రశ్నిస్తే..అరెస్టులా?

(మొదటి పేజీ తరువాయి)

అక్కడికి చేరుకుని అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులకు ఆస్పత్రి సందర్శనకు వెళ్లకుండా ఎలాంటి అనుమతి లేదని చెప్పడం సరికాదన్నారు. ఆస్పత్రుల్లోని డొల్లతనం, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతా యనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అరెస్టులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై నిరంతరం బీఆర్ఎస్ తరపున పోరాటం చేస్తామన్నారు.

### ఎమ్మెల్యే తలసాని హౌజ్ అరెస్ట్

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిని సందర్శించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయనతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒకవైపు ప్రజా ప్రభుత్వం అని ప్రచారం చేసుకుంటూ మరోవైపు అక్రమ నిర్బంధాలు, తప్పుడు కేసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు ఆస్పత్రిని సందర్శించకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆస్పత్రి సందర్శనకు వెళ్తామంటే ప్రభుత్వానికి ఎందుకంత భయమని నిలదీశారు. అక్రమ నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలనే ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి చర్యలకు త్వరలోనే ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

---

# అర్హులు ఓటరు జాబితాలో..అనర్హులు జాబితా బయట

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** అర్హులైన ఓటరు మిగలకూడదు.. అనర్హుడు ఓటరు జాబితాలో చేరకూడదని ఉన్నతాధికారులకు తెలంగాణ ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎన్నిక సంఘం కార్యాలయంలో ఎస్ఐఆర్ సర్-2026పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓలు, ఈఆర్ఓలతో సీఈవో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని వారిని ఆదేశించారు.
అనామలీస్, నో- మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

క్లకెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు నోటీసులు జారీ చేసి విచారణలు చేపట్టాలని తెలిపారు. జాబితాలోని కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని వారికి వివరించారు.

ఫారం 6, 6ం, 7, 8పై కెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చెయ్యాలన్నారు. ఓటర్లకు నోటీసుల వివరాలు బీఎల్‌వోలు స్పష్టంగా చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నో- మ్యాపింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారికి సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.

---

# నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం

**- సంస్కరణలపై సుప్రీంలో విచారణ**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 19:** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ వ్యవహారం, జాతీయ పరీక్షల సంస్థలో సంస్కరణలకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పరీక్షల నిర్వహణలో శాశ్వత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని కోర్టు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణకు పటిష్ఠ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ఎన్‌టీఏలో చేపట్టిన సంస్థాగత సంస్కరణలు, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల పారదర్శకత, సైబర్ భద్రత తదితర అంశాలపై పూర్తి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాలని సుప్రీంకోర్టు కోరింది. కేవలం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ ఆరాధే ధర్మాసనం ఈ వ్యవహారాన్ని విచారిస్తోంది. ఎన్‌టీఏలో సంస్కరణలను తాము పర్యవేక్షిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా వ్యవస్థాగత మార్పులు అవసరమని పేర్కొంది. ఎన్టీఏను సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నీట్ పరీక్షల భద్రతకు శాశ్వత కమిటీ అవసరమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వసనీయత కోసం ఎన్టీఏలో నిర్మాణాత్మక మార్పులు చేయాలని సూచించింది. నీట్-2026 ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో పరీక్ష రద్దు చేయాల్సి రావడం, విద్యార్థులు ఎదుర్కొన్న ఇబ్బందుల తర్వాత ఎన్టీఏ పనితీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎన్టీఏలో శాశ్వత సంస్కరణలు అమలు చేయడంపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

# టేబుల్‌పై డిఎంకె అవినీతి ఫైల్స్

**వాటిని అప్పడే తెరిచేలా చేయకండి**

**తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ సంచలన వ్యాఖ్యలు**

**తొలి అక్షరం/చెన్నై,ఆగస్టు 19:** ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. వాటిని ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు. అందుకే ప్రజలు మాపై నమ్మకంతో ఈ స్థానంలో కూర్చోబెట్టారు. ఉప ఎన్నికల సమయంలో నేను మాట్లాడతాను. ప్రజలకు కొంత మంచి జరగనివ్వండి' అని అన్నారు.

---

# కోవిడ్ విస్తరణ అమెరికా పాపమే!

(మొదటి పేజీ తరువాయి)

మోడీ సర్కారు నిరోధించేచర్యలు చేపట్టలేదు. కాలం గిర్రున తిరిగి, నిజం నిలకడ మీద ప్రపంచానికి తెలిసి వస్తున్నది. అసలు కోవిడ్ వైరస్‌పై ప్రయోగాలు చేసింది అమెరికానే అనీ, ఆ దేశం దానికోసం నిధుల్ని కూడా సమకూర్చిందని ఆ ఆపరేషన్‌లో భాగస్వాములు అయిన మాజీ అధికారులు ఇప్పుడు స్పష్టంచేస్తున్నారు. దీనిపై అమెరికాలో నమోదైన కేసుల్లో ఇప్పటికే పలువురు అరెస్టు అయ్యారు. కరోనా పరిశోధనలకు అమెరికా నిధులు సమకూర్చిం దని ఆ దేశ మాజీ అధికారి అంగీకరించారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాన వైద్య సలహాదారు డాక్టర్ ఆంథోనీ ఫౌచీ వద్ద సలహాదారుగా పని చేసిన డేవిడ్ మోరెన్స్ ఈ విషయాన్ని బహిరంగంగా వెల్లడించారు.కొవిడ్ వైరస్‌పై పరిశోధనలకు వెచ్చించిన నిధుల రికార్డులు, ఇతర పత్రాలను అధికారిక సిస్టమ్‌లో కాకుండా, చట్టాల నుంచి తప్పించుకోవడానికి వ్యక్తిగత ఇ-మెయిల్స్‌లో దాచినట్లు పేర్కొన్నారు. కొవిడ్ పరిశోధన గ్రాంట్లకు సంబంధించి ఏప్రిల్ 2020 నుంచి ఏజెన్సీకి అందిన ప్రజా రికార్డుల అభ్యర్థనలను అడ్డుకున్నట్లు డేవిడ్ మోరెన్స్‌పై ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు ఆయనను విచారించగా.. తన తప్పును అంగీకరించారు. కోవిడ్ మహమ్మారి మొదలైన సమయంలో ఆంథోనీ ఫౌచీ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అలర్జీ అండ్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్' (ఎన్ఐఏఐడీ) అధిపతిగా ఉండగా, తాను సహాయకుడిగా ఉన్నానని ఫెడరల్ కోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మోరెన్స్ పేర్కొన్నారు. వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్-19 ఉద్భవించిందన్న ఆరోపణల నేపథ్యంలో.. గబ్బిలాల్లోని కరోనా వైరస్‌లపై చేస్తున్న పరిశోధన గ్రాంటును నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ రద్దు చేయాలని నిర్ణయించుకుంది.అయితే, ఆ గ్రాంటును పునరుద్ధరించడానికి ల్యాబ్ నుంచి కొవిడ్ లీక్ అయిందన్న విషయాన్ని తప్పుడు కథనంగా చూపేలా సాయం చేస్తానని మోరెన్స్ చైనాలోని యాజమాన్యానికి హామీ ఇచ్చారని ప్రాసిక్యూటర్లు తెలిపారు. అందులో భాగంగానే కరోనా సహజసిద్ధంగా, జంతువుల నుంచే వ్యాప్తి చెందిందనే వాదనను బలంగా ప్రచారం చేయించారన్నారు. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు వారు ప్రభుత్వ ఇ-మెయిల్ ఖాతాకు బదులుగా మోరెన్స్ వ్యక్తిగత ఖాతాను ఉపయోగించి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు గుర్తించామన్నారు. దీంతో ఈ విషయంపై ఆంథోనీ ఫౌచీని కూడా విచారించే అవకాశం ఉంది. కరోనాపై ప్రమాదకర పరిశోధనల కోసం చైనాలోని వుహాన్ ప్రయోగశాలకు అమెరికా నుంచి నిధులు అందాయని, ఆ వైరస్ పుట్టుకపై వాస్తవాలను అగ్రరాజ్య ఉన్నతస్థాయి వ్యక్తులు తొక్కిపెట్టారని జూన్‌లో అమెరికా మాజీ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బార్డ్ వెల్లడించారు. ఈ మొత్తం కుట్ర వెనుక ఉన్న వ్యక్తి.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రధాన వైద్య సలహాదారుగా పనిచేసిన ఆంథోనీ ఫౌచీ అని పేర్కొన్నారు. త్వరలో ఫౌచీని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది. ఈ కేసు విచారణలో కోవిడ్ మూలాల రికార్డులు దాచేందుకు కుట్ర పన్నినట్టు డేవిడ్ మోరెన్స్ చెప్పడం వల్ల ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలో దీనిపై చర్చకు ప్రాధాన్యత ఏర్పడింది. అమెరికా అసలు రంగు బయటపడుతున్నదని పలు దేశాల్లో ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.

---

# లోక్‌సభ సీట్లు యధాతథంగా కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

విరాళాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్‌లు మీడియాకు వెల్లడించారు.
అరుణాలచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణలపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. విదేశీ విధానంపైనా విమర్శలు గుప్పించింది. అనేక అంశాల్లో కేంద్రం వైఫల్యం చెందిందని ఆరోపించిన కాంగ్రెస్.. విద్యార్థులు, యువతతో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 800 నగరాలు, పట్టణాల్లో వీటిని నిర్వహించాలని, కొన్ని చోట్ల రాహుల్ పాల్గొంటారని పేర్కొంది.

# ఫోటో జర్నలిస్టుగా చంద్రబాబు

**తొలి అక్షరం/అమరావతి,ఆగస్టు 19:**
వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటో జర్నలిస్ట్‌గా మారారు. ఫొటో జర్నలిస్ట్‌లు అందరిని కలిపి సీఎం గ్రూప్ ఫొటో తీశారు. కెమెరా తీసుకుని తానే ఫొటో తీస్తానని చెప్పారు. వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఫొటో జర్నలిస్ట్‌లు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రను నమోదు చేస్తూ.. జ్ఞాపకాలను పదిలపరుస్తున్న ఫొటోగ్రాఫర్లకు సీఎం అభినందనలు తెలిపారు. మానవ అనుభవాలను, అద్భుతమైన చిత్రాలుగా ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు చెప్పారు. మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్ల అంకితభావం, కళాత్మకత, నిరంతర కృషి అభినందనీయమని ప్రశంసించారు.

# సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, గ్రామస్థాయి నుంచి పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్, నిజామాబాద్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, కామారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పీఏసీ సభ్యులు, డీసీసీ నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సమిష్టి నాయకత్వం, ప్రజలతో మమేకమే లక్ష్యంగా ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# ప్రతి రైతుకు సకాలంలో రుణాలు అందాలి

(మొదటి పేజీ తరువాయి)

16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.

క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

# ఉచిత పథకాల పేరుతో ప్రజాధనం వృధా

(మొదటి పేజీ తరువాయి)

లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయ పడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తివేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.

# పార్టీ లైన్ దాటిన కొండా సుస్మిత

- సిఎం రేవంత్ ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యాఖ్యలు
- సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్ కమిటీ



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 19:** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ పీసీసీ అగ్రహం వ్యక్తం చేసింది. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె తల్లి కొండా సురేఖను వివరణ కోరాలని నిర్ణయించింది. మరోవైపు కొండ సుస్మితపై క్రమశిక్షణ కమిటీ ఇప్పటికే సీరియస్ అయిన సంగతి తెలిసిందే. ఆమెపై కఠిన చర్యలకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సిద్ధమవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని ఆ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంకో వైపు ఈ వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక అందజేయాలని ఇప్పటికే టీపీసీసీ చీఫ్‌ను ఆమె కోరిన విషయం విదితమే. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని వెల్లడించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలపై పార్టీ సీరియస్ అయింది.

# దళిత నేత రామకృష్ణకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నివాళి.. పాడె మోసిన ప్రవీణ్ కుమార్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 19:** దళిత జాతి హక్కుల కోసం పోరాడిన దళిత జాతి ముద్దుబిడ్డ గౌడెల్లి రామకృష్ణ గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాచారంలోని రామకృష్ణ నివాసానికి చేరుకొని ఆయన భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.రామకృష్ణ మృతి చెందడం నాచారం ప్రాంతానికే కాకుండా దళిత జాతికే తీరని లోటు అని ఆయన అన్నారు. దళిత సమాజం కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని, అంకిత భావంతో పనిచేసిన, దళిత జాతి ఉద్యమ నేతను కోల్పోవడం చాలా బాధాకరమని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రామకృష్ణ అంతిమ యాత్రలో పాల్గొని పాడేమోసి తుది నివాళులర్పించారు.

# దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది

**దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళ పంపిణీ చేసిన మంత్రి**



**తొలి అక్షరం/ఖమ్మంజిల్లా ఆగస్టు - 19:** దివ్యాంగుల సంక్షేమానికి, వారి ఆర్థిక, సామాజిక వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున వంద శాతం సబ్సిడీపై సమకూర్చిన త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళను బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ స్వశక్తితో జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. రవాణా సౌకర్యం సులభతరం కావడానికి ఈ ట్రై మోటార్ సైకిళ్లు ఎంతో తోడ్పడతాయని అన్నారు. దివ్యాంగత్వాన్ని వైకల్యంగా భావించకుండా, బలమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. సరైన పట్టుదల ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని, దివ్యాంగులు సమాజంలో స్వయం సమృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

**- గంట్లకుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతల ఐలయ్య**






**పెద్దవంగర, ఆగష్టు 19 తొలి అక్షరం:** ఎమ్మార్పీఎస్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ని బలోపేతం చేయాలని, సెప్టెంబర్ 9న వరంగల్ లో జరగబోయే ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని నూతన అధ్యక్షుడు చింతల ఐలయ్య అన్నారు . పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామంలో మండల ఇంచార్జి జలగం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి రాంపాక కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల ఐలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు మచ్చ మహేందర్, ప్రధానకార్యదర్శి చింతల సురేష్, కోశాధికారి చింతల యాకయ్య, కార్యదర్శి చింతల నవీన్ , మచ్చ సోమన్న, సహాయ కార్యదర్శి చింతల సురేష్, చెడిపాక యాకస్వామి, కార్యవర్గ సభ్యులుగా చింతల బాలరాజు, చెడుపాక సమ్మయ్య, చెడుపాక వెంకన్న , చింతల వంశీ, చింతల వెంకన్న, చింతల హరీష్, గాడిపెల్లి యాకయ్య, చింతల రామకృష్ణ, చింతల సమ్మయ్య, చింతల రామకృష్ణ ( కిరణ్ ), మచ్చ హరీష్, చింతల నవీన్,గాడిపెల్లి ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ... సమాజంలో సమసమాజ స్థాపన కోసం పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి అందరూ ముందుకు రావాలని, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక పరివర్తన కోసం జరుగుతున్న ఈ నిర్మాణ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో , చింతల నర్సయ్య, చింతల మహేందర్, మచ్చ యాకయ్య, చెరుకు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 19:** తొర్రూరు డివిజన్ కేంద్రంలో బుధవారం విశ్రాంతి భవనంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు నిర్వహించచారు.ఈ సందర్భంగా తొర్రూరు మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు మెరుగు కరుణాకర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఫోటోగ్రఫీ కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని నాటి జ్ఞాపకాలను, నేటి చారిత్రక ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే ఒక గొప్ప కళ అని అన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఫోటోగ్రాఫర్లు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలిపి ఫోటోగ్రఫీ



రంగం మరింత అభివృద్ధి చెందాలని అన్నారు.ఈ కార్యక్రమాన్ని ముందుగా గౌరవ అధ్యక్షులు మాచర్ల వెంకన్న లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాసర్ల రవికుమార్,మాజీ అధ్యక్షులు సాదు సుమన్, ముఖ్య సలహాదారులు నల్ల ఎల్లారెడ్డి,మాజీ అధ్యక్షులు సీనియర్ ఫోటోగ్రాఫర్ బొల్లోజు హరి మోహన చారి, జిల్లా ఉపాధ్యక్షులు గంధం గోపి,జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దెల సురేష్,మండల ఉపాధ్యక్షులు కల్లూరు శ్యామ్ కుమార్, గాజుల రాజు,సహాయ కార్యదర్శులు గండి సిద్ధు,సీనియర్ ఫోటోగ్రాఫర్స్,కొల్లూరి శ్రీధర్ ,ఇటుకల రమేష్ , బోలగాని రవికుమార్,కమ్మగాని సుధాకర్, కనుకుంట్ల వెంకన్న, కస్తూరి సతీష్, అబ్బ మాన్ల సత్యనారాయణ, మచ్చ నాగరాజు, ఇటుకల సంతోష్, గోనె అమరేందర్, గోటుకుల మధుకర్, ఎండి పాషా,గుగ్గిళ్ళ సాయి రూప,శీలం సుమంత్, శీలం సంతోష్,రాంపల్లి హరీష్, రాపోలో సాయి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం...

**పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి**

**పల్లెగూడెం గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

**తొలి అక్షరం/ఖమ్మంజిల్లా ఆగస్టు - 19:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలో ఉంటే, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల



స్థలాలు అందిస్తామని తెలిపారు.పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ. 61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి అన్నారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎస్ఎస్పీ కాల్వ గట్టుపై రూ. 5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు.రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ. 12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో 110 గ్రామ పంచాయతీ నూతన భవనాలు మంజూరై అన్ని గ్రౌండింగ్ అయి, వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అంగన్వాడీలకు నూతన భవనాల నిర్మాణం తుది దశలో ఉందన్నారు. వివో భవనాల నిర్మాణానికి 20 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధ్యతగా వ్యవహరిస్తూ అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కమీషనర్ శ్రీనివాస రెడ్డి, పల్లెగూడెం సర్పంచ్ చుండూరి సుజన కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

# ఇనుగుర్తి నూతన ఎస్సై నరేష్ మెడికల్ అసోసియేషన్ శాలువతో సన్మానం

**శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరరహిత మండలంగా తీర్చిదిద్దడమే ధ్యేయం**

**పోలీస్ యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరిస్తాం**

**తొలి అక్షరం/ఇనుగుర్తి, ఆగస్టు 19:** ఇనుగుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పి. నరేష్‌ను మండల మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి పూలదండలు, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. అనంతరం మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... ఇనుగుర్తి మండలంలో శాంతిభద్రతల



పరిరక్షణకు పోలీస్ శాఖ అహరహం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. మండలాన్ని సమగ్రంగా నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ యంత్రాంగానికి తమ వంతు నుంచి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజల రక్షణతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ విషయంలో పోలీస్ శాఖతో తోడుగా ఉంటూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.మెడికల్ అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ కలయిక, శుభాకాంక్షల పట్ల ఎస్సై పి. నరేష్ తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. మండలంలో శాంతిభద్రతలు సజావుగా సాగాలంటే సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం, సహకారం ఎంతో అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, మరింత మెరుగైన, సత్వర సేవలు అందించేందుకు పోలీస్ శాఖ తరఫున శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు వేములపల్లి రాములు, ప్రధాన కార్యదర్శి మునిగంటి రమేష్, కోశాధికారి యాకాంబ్రం, సభ్యులు వనం సంపత్, చెడుపాక రఘు, బూర రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందించాలి..

**లేకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం**

**తొలి అక్షరం/పత్తికొండ ఆగస్టు 19:-**రైతులకు తక్షణమే సాగునీరు అందించాలని, లేనిపక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ హెచ్చరించారు. బుధవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.హంద్రీనీవా కాలువ వెంట సాగు చేసుకుంటున్న రైతుల మోటార్ విద్యుత్ కనెక్షన్లను అధికారులు తొలగించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ రైతులపై ఇలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. 2024లో శ్రీశైలం ప్రాజెక్టులో కేవలం 35.23 టీఎంసీల నీటి నిల్వ ఉన్నప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని,



వారి విజ్ఞప్తి మేరకు హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా సాగునీరు అందించారని గుర్తు చేశారు.ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో సుమారు 169.75 టీఎంసీల నీటి నిల్వ ఉన్నప్పటికీ వర్షాలు లేక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని శ్రీదేవమ్మ అన్నారు. ఇలాంటి సమయంలో రైతుల పంటలను కాపాడాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా హంద్రీనీవా కాలువ వెంట పొలాలు ఉన్న రైతుల మోటార్ విద్యుత్ వైర్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలిచి, పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతుందని కంగాటి శ్రీదేవమ్మ స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి ప్రయోజనం అందించాలి...

**దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి**

**జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలి**

**గురుకులాలు, పాఠశాలల్లో ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి**

**సన్నబియ్యం పంపిణీలో అక్రమాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలి**

**అమృత్ 2.0 పనులను వేగవంతం చేసి విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి**

**ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి**

**డీఎంఎఫ్‌టీ నిధుల వినియోగంపై నివేదిక సమర్పించి కమిటీ సమావేశాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలి**

**దిశా కమిటీ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పనుల పురోగతిపై సమీక్ష**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ఆగస్టు - 19:** ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి కార్యక్రమం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి నిర్వహించారు. గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును సమావేశంలో పరిశీలించారు. జాతీయ రహదారులు, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ, గిరిజన సంక్షేమం, మార్కెటింగ్, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మహిళా శిశు సంక్షేమం, పౌరసరఫరాలు, విద్య, వైద్యం, మున్సిపాలిటీలు, మత్స్యశాఖ, తదితర శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులను కేవలం మంజూరు చేయడంతో సరిపెట్టకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిధులు లేదా అనుమతులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా ఫాలో అప్ చేస్తామని తెలిపారు. జాతీయ రహదారుల




పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన భూ సేకరణను త్వరగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖలో పూర్తయిన అన్ని పనులను సంబంధిత స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించాలని, ఉపాధి హామీ పనుల క్రింద మంజూరైన వీఓ భవనాల వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా త్రాగునీటి కోసం మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. పనుల్లో అవసరమైన సవరణలు, మార్పులు ఉంటే సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులను వినియోగించిన వివరాలను సమర్పించాలని, డీఎంఎఫ్‌టీ కమిటీ సమావేశాన్ని త్వరగా నిర్వహించి, ఇకపై సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం పిల్లల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నందున ఆ నిధుల ప్రయోజనం క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిశితంగా పర్యవేక్షించాలని ఎంపీ అన్నారు. బ్లాక్ మార్కెటింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎక్కడెక్కడ బ్లాక్ మార్కెటింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయో గుర్తించి, సంబంధిత ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి అక్రమాలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో అమృత్ 2.0 నిధులతో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ అన్నారు. పనులకు అవసరమైన భూ కేటాయింపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రైనేజీ, త్రాగునీటి పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా విలీన ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఖమ్మం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు రైల్వే భూముల మార్పిడి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ 2026లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ల్యాండ్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌కు త్వరగా ఆమోదం పొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నామినేటెడ్ సభ్యులు, జిల్లా అధికారులు, సర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# గ్రామాల్లో కాంగ్రెస్‌కు కొత్త సారథులు

- **పకీరతండా అధ్యక్షుడిగా గుగులోత్ రెడ్డి..**
- **నరసింహాపురం బంజర అధ్యక్షుడిగా నీలం వెంకన్న**





**తొలిఅక్షరం/నర్సింహులపేట ఆగస్టు 19:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు మండలంలోని పకీరతండా, నరసింహాపురం బంజర గ్రామాల్లో నూతన కాంగ్రెస్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దస్రు నాయక్, మాజీ అధ్యక్షుడు జినుకల రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. పకీరతండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుగులోత్ రెడ్డి, నరసింహాపురం బంజర గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నీలం వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచందర్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దస్రు నాయక్, కమిటీ సభ్యులకు నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాబురావు, సమన్వయ కమిటీ సభ్యులు రాజశేఖర్, ఎండి మహబూబ్ ఖాన్, అశోక్ రెడ్డి, గడ్డి వెంకటరెడ్డి, చిర్ర సతీష్ గౌడ్, ఉపసర్పంచ్ కాసా యాకన్న, హరిలాల్, అలు వాల శ్రీనివాస్, దోమల యాదగిరి తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: వరంగల్ జిల్లా అధ్యక్షులు గాజే వేణుగోపాల్

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన టీఎన్జీవో స్ భవన్ హైదరాబాద్ లో జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమం, హెల్త్ కార్డుల త్వరిత అమలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని మరియు సిపిఎస్ సమస్యను పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మొట్టమొదటిసారిగా టీఎన్జీవోస్ జెండా, కండువా ను మరియు ఉద్యోగుల గొంతుక పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ లు నిరంతరం కృషి చేస్తు సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గజ్జల రామ్ కిషన్ ను, అలాగే నూతన అధ్యక్ష, కార్యదర్శులుగాజే వేణుగోపాల్, పాలకుర్తి సదానందం లను సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, కోశాధికారి కిరణ్, రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, హన్మకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజేందర్, సోమయ్య, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బూరుగు రవి, జనగాం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా షరీఫ్, శ్రీనివాస్ ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోల రాజు, మేడి చైతన్య, రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని జిల్లా నుండి అధ్యక్షులు కార్య దర్శులు పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.




# మోడల్ సోలార్ గ్రామంగా చెరువుమాధారం..

**ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతి గృహంలో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం**

**713 గృహజ్యోతి లబ్దిదారుల గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు**

**రైతుల వ్యవసాయ మోటార్లకు సైతం సోలార్ విద్యుత్ అందించేలా పైలట్ ప్రాజెక్టు**

**చెరువుమాధారంలో గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను ప్రారంభించిన మంత్రి**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ఆగస్టు - 19:** జిల్లాలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతో పాటు, పేద కుటుంబాల విద్యుత్ అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం చెరువుమాధారం గ్రామంలో గృహాలకు ఏర్పాటు చేసిన 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించి, లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్న హామీ మేరకు గృహజ్యోతి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉచిత విద్యుత్ పథకంతో ప్రత్యేక అనుబంధం ఉందని, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమం, రైతుల సంక్షేమం, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. చెరువుమాధారం గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేసి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామంలోని అర్హత కలిగిన గృహాలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబం సాధారణంగా నెలకు 140 నుంచి 150 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే, సోలార్ వ్యవస్థ ద్వారా





సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబం వినియోగించిన తర్వాత మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి, నిబంధనల ప్రకారం మిగులు విద్యుత్‌కు సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధంగా ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని వివరించారు. గృహాలకే పరిమితం కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ అందించే దిశగా చెరువుమాధారాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. 10 హెచ్పి సామర్థ్యం కలిగిన వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహాలకు సౌర విద్యుత్, రైతుల వ్యవసాయ మోటార్లకు సౌర విద్యుత్ అందించడం ద్వారా చెరువుమాధారం గ్రామాన్ని సమగ్ర మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సోలార్ ప్రాజెక్టుకు దశలవారీగా భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకంతో పాటు రైతులకు కూడా సోలార్ విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, రైతుల మేలు, మహిళల అభ్యున్నతి, యువత భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

---

# వరంగల్‌లో తొలిసారిగా 100కు పైగా స్టాల్స్‌తో వరంగల్ బిజినెస్ అండ్ స్టార్టప్ ఎక్స్పో - 2026

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ నగరంలో తొలిసారిగా వ్యాపార సంస్థలు, స్టార్టప్స్, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, యువ వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో వరంగల్ బిజినెస్ అండ్ స్టార్టప్ ఎక్స్పో - 2026 ను ఆగస్టు 22, 23 తేదీల్లో భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ ఎక్స్పో లో 100కు పైగా స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నారు.

వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థలు, స్టార్టప్స్ తమ ఉత్పత్తులు, సేవలు, కొత్త ఆలోచనలు, వ్యాపార నమూనాలను ప్రజలకు పరిచయం చేసుకునే అవకాశం కల్పించనున్నారు. స్టార్టప్స్ కు పెట్టుబడిదారులతో నేరుగా పరిచయాలు ఏర్పరచుకోవడం, తమ ఆలోచనలకు పెట్టుబడులు, కొత్త అవకాశాలు పొందడం, వ్యాపార సంస్థలకు తమ ఉత్పత్తులు, సేవలకు విస్తృత ప్రచారం కల్పించడం ఈ ఎక్స్పో ప్రధాన ఉద్దేశం. అలాగే వివిధ రంగాలకు చెందిన




వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, పారిశ్రామి కవేత్తలు ఒకే వేదికపై కలుసుకోవడం ద్వారా కొత్త వ్యాపార భాగస్వామ్యాలు, అవకాశాలకు మార్గం ఏర్పడ నుంది. ఈ ఎక్స్పో కోసం ఇప్పటికే విస్తృత స్థాయిలో డిజిటల్ మార్కెటింగ్, ప్రత్యక్ష ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పెద్ద సంఖ్యలో సందర్శకులు హాజరవుతారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. వరంగల్‌లోని వ్యాపార, స్టార్టప్ రంగానికి ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి, స్థానిక వ్యాపారాలు, కొత్త ఆలోచనలకు మరింత గుర్తింపు, అవకాశాలు, ప్రోత్సాహం కల్పించడమే ఈ ఎక్స్పో ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో ఫౌండర్స్ నితిన్, అనిల్ సభ్యులు అశ్విని, మణికంఠ, గౌతమ్, అనిరుద్ పాల్గొన్నారు.

# షాద్‌నగర్ డివిజన్‌లో నలుగురు ఎస్సైల బదిలీ

● ఒకేసారి బదిలీలు..

పోలీసు శాఖలో చర్చనీయాంశం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు19:** షాద్‌నగర్ డివిజన్‌లో నలుగురు ఎస్సైలు బదిలీ అయ్యారు. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సుశీల బదిలీపై నందిగామ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కొందుర్గు ఎస్సైగా పనిచేస్తున్న రవీందర్ నాయక్ బదిలీపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. జిల్లేడు చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విజయ్ షాబాద్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌ను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి షాద్‌నగర్ డివిజన్ వచ్చిన తర్వాత ఒకేసారి నలుగురు ఎస్సైలు బదిలీ కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. దీంతో పోలీసు శాఖ వర్గాల్లో ఈ బదిలీలు చర్చనీయాంశంగా మారాయి. కాగా, బదిలీ అయిన ఎస్సైల స్థానాల్లో ఎవరిని నియమిస్తారనే విషయం ఇంకా వెల్లడికాలేదు..

# బాలికల బద్రతపై విద్యార్థినిలకు అవగాహన

**- ఆత్మవిశ్వాసం, స్వియరక్షణ, సామాజిక బాధ్యతలపై వివరణ**

**తొలి అక్షరం/వేంపల్లె ఆగస్టు 19:-** బాలికల బద్రతపై ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ విద్యార్థినీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం ఆ క్యాంపస్ లోని మహిళా సెల్, ఐసిసి, ఎన్ఎస్-ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పియూసి విద్యార్థినీలకు ఆత్మవిశ్వాసం, స్వియరక్షణ, చట్టపరమైన హక్కులు, అప్రమత్త, సామాజిక బాధ్యతలపై ఆర్కేవ్యాలి ఎస్సై శ్రీప్రియ వివరణ ఇచ్చారు. విద్యార్థినీలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా ధైర్యంగా ఉండాలని, సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. చదువుపై శ్రద్ధ చూపి, దేశానికి మంచి పౌరులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. దీప్తి, ఐసిసి కోఆర్డినేటర్ రత్నకుమారి, వార్డెన్లు ప్రభావతి, షంషాద్ బేగం, సెక్యూరిటీ అధికారి రుద్ర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనంద్ కుమార్ పాటిల్ జయంతికి ఘన నివాళులు

**- హైదర్‌నగర్‌లో మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నసమారాధన**




**తొలి అక్షరం/కూకట్ పల్లి ఆగస్టు 19:-** హైదర్‌నగర్‌లో కీర్తిశేషులు ఆనంద్ కుమార్ పాటిల్ జయంతిని పురస్కరించుకుని ఆనంద్ కుమార్ మిత్ర మండలి ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1,000 మందికి అన్నదానం చేశారు.అనంతరం ఆయన చిత్రపటానికి మిత్రులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆనంద్ కుమార్‌తో తమకున్న అనుబంధాన్ని, స్నేహ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ...ఆయన భౌతికంగా లేకపోయినా తమ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.ఆయన సేవాభావాన్ని స్మరిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. మిత్ర మండలి సభ్యులు, కుటుంబ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫొటో జర్నలిస్టులకు ఘన సన్మానం



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి :** ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఫొటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు.గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులను శాలువాతో సన్మానించి మెమోంటో అందించటంతో పాటుగా ప్రతీ ఫొటో జర్నలిస్టుకు 2,000/- రూపాయల నగదు పారితోషికాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య,కోశాధికారి బోల్ల అమర్,ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం,కొడిపెల్లి దుర్గాప్రసాదరావు,జాయింట్ సెక్రెటరీలు పొడిచెట్టి విష్ణువర్ధన్,వలిశెట్టి సుధాకర్,సంపెట సుధాకర్,కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్,ఎండీ నయీంపాషా,ఫొటో గ్రాఫర్లు దాసరి శ్రీనివాస్,మంగనూరి మురళి,గొట్టె వెంకన్న,చేతి శ్రీనివాస్,కుడుతుల రమేష్,మాషూక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూలగూడ గ్రామలో మెగా హెల్త్ క్యాంప్

● 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

● నాటుకో ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు19:** నందిగామ మండలం మొత్కూలగూడ గ్రామంలో నాటుకో ట్రస్ట్ సహకారంతో బుధవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 150 మంది హెల్త్ చెక్అప్ చేయించుకున్నారు.శిబిరంలో వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, సమస్యలపై తగిన సూచనలు, సలహాలు అందించారు. వృద్ధులు, మహిళలు, యువతతో పాటు చిన్నారులు కూడా శిబిరానికి హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందితే ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చున్నారు. నాటుకో ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని గ్రామస్థులు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వానరసి నర్సింహా , మాజీ సర్పంచ్ ఎల్లమ్మ నరసింహ, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు,తదితరులు పాలొగొన్నారు.

# 9వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**- 9వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన చైర్మన్ చైర్మన్ అగ్గనూరి బస్వాం**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు19:** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూరి బస్వాం, 9వ వార్డు కౌన్సిలర్ అశోక్ ప్యాట్ శంకుస్థాపన చేశారు. కాలనీ వాసుల సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో రోడ్డు సౌకర్యం మెరుగుపరచడమే లక్ష్యంగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రాము, గంగాధర్, లక్ష్మీకాంత్, మాధవులు, చెన్నయ్య, వినయ్, అల్లం అనిల్‌కుమార్, శేఖర్, జీఎం కన్స్ట్రక్షన్స్ సిబ్బంది, మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు దుర్గ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# మన్నెగూడలో చెస్ కప్2026 పోటీలు



**తొలి అక్షరం/ హైదరాబాద్, ఆగస్టు19:** నైట్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 23న మన్నెగూడలో ఇండిపెండెన్స్ డే చెస్ కప్2026 నిర్వహించనున్నారు. స్లోకా ఇంటర్నేషనల్ స్కూల్‌లో పోటీలు జరుగుతాయి. అండర్8, 10, 13 విభాగాల్లో రేటింగ్ లేని క్రీడాకారులు పాల్గొనవచ్చు. ఐదు రౌండ్లలో పోటీలు నిర్వహించి, ఒక్కో రౌండ్‌కు 15 నిమిషాల సమయం కేటాయించారు. మూడు విభాగాల్లో టాప్20 స్థానాల్లో నిలిచిన వారికి మొత్తం 60 బహుమతులు అందించనున్నారు. దరఖాస్తులకు ఈ నెల 21 చివరి తేదీ. చీఫ్ అర్బిటర్‌గా జ్యోతి గణేశ్ ఇనగంటి వ్యవహరించనున్నారు. వివరాలకు 8520818303ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

# దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా: వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు...



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గంలోని 65వ డివిజన్ లోని కోమటిపల్లి గ్రామం మధుర నగర్ లో నూతన శ్రీ కూర్మచల అష్టలక్ష్మి సమేత నవనారసింహ వారాహి దేవస్థానం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయ వ్యవస్థాపకులు,అర్చకులు శ్రీమాన్ సేవాపతి రంగాచార్యులు,ఎమ్మెల్యే ను శాలువాలతో సత్కరించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవాటు చేసుకోవాలని నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు నిరంతరం సంపూర్ణ సహకార అందిస్తున్నామని అన్నారు.సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు.ప్రశాంతమైన వాతావరణంలో ఇంత మంచి ఆలయాన్ని నిర్మించిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ సునీల్, హసన్ పర్తి యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ లావుడ్య తిరుపతి,ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,డివిజన్ నాయకులు కుమార్,లింగు,విజయ్,ఆలయ కమిటీ సభ్యులు రమణ,హరీష్,కిషోర్ విజయ్,తిరుపతి,కుమార్,రమేష్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకోర్పోల్ గ్రామంలో ఘనంగా ముత్యాలమ్మ (పోచమ్మ) బోనాల పండుగ

**- సర్పంచ్ భానోత్ అనిత- బద్రునాయక్, ఉప సర్పంచ్ తొగరు వెంకన్న**








**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 19:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కొర్పుల్ గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాల పండుగ నిర్వహించడం జరిగింది.శ్రావణమాసంలో గ్రామీణ ప్రాంతంలో జరిగే బోనాల పండుగ, తెలంగాణ సంస్కృతికి సంప్రదాయానికి అద్దం పట్టే విధంగా గ్రామీణ ప్రాంతంలో బోనాల పండుగ నిర్వహించడం జరుగుతుంది. చిన్న కొర్పుల్ గ్రామంలో ముత్యాలమ్మ ( పోచమ్మ) బోనాలు ప్రత్యేకంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆనాటి నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలను నేటితరం యువత సాంప్రదాయాన్ని అందిపుచ్చుకునే విధంగా శ్రావణమాసంలో బోనాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గంగపురి చంద్రమౌళి గౌడ్, కొయ్యడ అయిలయ్య , తొగరు సంపత్, కొయ్యడ అనిల్ కుమార్ గౌడ్, కొయ్యడ రాజు అన్నబోయిన రాజు, గ్రామ శివసత్తులు తొగరు విజయ వరమ్మ బక్కమ్మ, కడారి రజిత, గ్రామ మహిళలు బోనాల పండుగలో పాల్గొనడం జరిగింది.

# నూతన గృహప్రవేశానికి హాజరైన మహబూబ్ నాయక్ తండా సర్పంచ్ బానోతు మంజుల -మీటు నాయక్.



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 19:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని మహబూబ్ నాయక్ తండాలో నూతన గృహప్రవేశానికి హాజరైన సర్పంచ్ బానోతు మంజుల మిట్టు నాయక్, మహబూబ్ నాయక్ తండ గ్రామపంచాయతీ పరిధిలోని భూక్యా రవి-ఈరమ్మ ల నూతన గృహప్రవేశానికి హాజరైన సర్పంచ్ బానోతు మంజుల మీటు నాయక్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కరోబర్ భూక్య నరేష్ తండ ప్రజలు భుక్య సురేష్, సుమన్, తరుణ్ అశోక్ రాజశేఖర్, కిషన్ గణేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వయసుకు మించి మాటలు మాట్లాడటం సరికాదు

**కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తీవ్రంగా స్పందించారు.హన్మకొండ డీసీసీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు.కొండా సుస్మిత పటేల్ కనీసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కూడా కాదని,పార్టీ సభ్యత్వం కూడా లేని వ్యక్తి అని ఆయన అన్నారు.పార్టీపై,పార్టీ నాయకులపై అవగాహన లేకుండా మాట్లాడితే దానికి తాము ఏం సమాధానం చెప్పగలమని ప్రశ్నించారు.రాజకీయ అంశాలపై మాట్లాడే ముందు కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు.వయసుకు మించి మాటలు మాట్లాడే ముందు...జిల్లాలో సీనియర్ రాజకీయ ప్రస్థానంలో ఉన్న నాయకుడిపై విమర్శలు చేయడం సరికాదన్నారు.కొండా సుస్మిత పటేల్ మాట్లాడిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ,మార్క విజయ్ కుమార్,తోట వెంకన్న,డివిజన్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహం తొలగింపుపై బిఆర్ఎస్ నాయకులు రాజకీయ దుష్ప్రచారం సరికాదు

### నెక్కొండ మండలం సోషల్ మీడియా కన్వీనర్స్ రావుల తిరుపతిరెడ్డి, భానోత్ వీరన్న.



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 19:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేయాలన్నా సంబంధిత అనుమతులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందే. అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఇందులో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కి ఎలాంటి సంబంధం లేదు.అధికారులు చేపట్టిన చట్టబద్ధమైన చర్యలకు రాజకీయ రంగు పులమడం, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయడం సరికాదు. విగ్రహం తొలగింపు విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను ఆశ్రయించి, చట్టపరమైన మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలి. కానీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేయడం, ప్రభుత్వాన్ని దూషించడం, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఆందోళనలు, అల్లర్లకు దారితీసే చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదు.స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీతో పాటు నర్సంపేట ప్రజలంతా గౌరవిస్తారు. ఆయన పై ఉన్న గౌరవాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం, చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు సమర్థనగా చూపించడం మాత్రం సమర్థనీయం కాదు.బీఆర్ఎస్ నాయకులు ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయకుండా సంయమనం పాటించాలి. నర్సంపేటలో శాంతిభద్రతలు, ప్రజల ప్రశాంత జీవనం అందరి బాధ్యత. కాంగ్రెస్ పార్టీ చట్టపరిపాలనకు, ప్రజాస్వామ్య విలువలకు, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుంది. జన్మదిన వేడుకలకు దూరంగా.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ,తన జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులతో ఆనందంగా గడపాల్సిన రోజును సైతం పక్కనపెట్టి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇచ్చారు.ప్రజా సమస్యలే తన ధ్యేయంగా భావిస్తూ హైదరాబాద్‌లో సంబంధిత మంత్రులను కలిసి నర్సంపేట నియోజకవర్గానికి చెందిన రైతులు, విద్యార్థులు, పాఠశాలలు, విద్యా రంగానికి సంబంధించిన పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చిస్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారు.సాధారణంగా జన్మదినం అంటే వేడుకలు, శుభాకాంక్షలు, ఆత్మీయ సమావేశాలకు ప్రాధాన్యత ఇచ్చే రోజు. కానీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన వ్యక్తిగత వేడుకల కంటే ప్రజల సమస్యలనే ముఖ్యంగా భావించి, తన జన్మదినాన్ని సైతం ప్రజా సేవకు అంకితం చేయడం ఆయనకు ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం."పదవి కోసం కాదు.. ప్రజల కోసం పనిచేయడమే లక్ష్యం" అనే భావనతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజా సేవా దృక్పథం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పేర్కొంటున్నారు. నర్సంపేట అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, రైతులువిద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజల సహకారం, ఆశీర్వాదాలు మరింత బలాన్ని చేకూర్చాలని కాంగ్రెస్ పార్టీ ఆకాంక్షిస్తుంది.

# గంగన్నగూడెం పాఠశాలకు కుమ్మరి సంఘం చేయూత

- ప్రభుత్వ పాఠశాలకు రూ.10 వేల ఆర్థిక సాయం
- 27 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ







**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** కొందుర్గు మండలంలోని గంగన్నగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు షాద్‌నగర్ కుమ్మరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేయూత అందించారు. పాఠశాల మరమ్మతులకు రూ.10 వేల ఆర్థిక సాయంతో పాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించారు. సంఘం అధ్యక్షుడు నడికూడా శ్రీశైలం పాఠశాల మరమ్మతుల కోసం రూ.10 వేల సాయం అందించారు. యెల్లయ్య జ్ఞానేశ్వర్ సౌండ్ బాక్స్‌ను బహూకరించారు. కొత్తూరు మండలం కుమ్మరిగూడెంకు చెందిన కుమ్మరి ఆంజనేయులు పాఠశాలలోని 27 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.కుమ్మరి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు మానస, ఆంజనేయులు, సంఘం కో–కన్వీనర్ వైన్స్ అంజయ్య, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, సభ్యులు సాయిలు, వెంకటయ్య, ఆటో శ్రీను, వార్డు మెంబర్ రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందించిన సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా సామగ్రి, బ్యాగులు అందించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పాలిటెక్నిక్ విద్యా భవిష్యత్తు ఏమిటి..?

### సాంకేతిక విద్యాను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
### యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలని ఆలోచనను మానుకోవాలి
### పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేస శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి
### ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహన్



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** షాద్ నగర్ నియోజకవర్గ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో ఈరోజు షాద్నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో జీవో నెంబర్ 97ను రద్దు చేసే భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించడం జరిగింది ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం పవన్ చౌహాన్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అని పేర్కొన్నారు దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లోమా విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి కాని రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర పన్నుతుందని విమర్శించారుపాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను రద్దు చేయాలని రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపింది కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారని ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు వేయలేదని తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ ఆలోచన విధానం సరికాదని దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతు ఉంటే అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం చూస్తూ ఊరుకోనేదే లేదని నిర్ణయాలను వెనుక తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతరానికి నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాశ్ నాయక్ షాద్నగర్ ఉపాధ్యక్షుడు సాయి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 25 రోజులుగా పైప్‌లైన్ పనులు.. కాలనీవాసులకు తప్పని అవస్థలు

### కౌన్సిలర్ శివ సూచనలు బేఖాతరు.. మెగా పైప్‌లైన్ పనుల్లో నిర్లక్ష్యం
### కొత్త రోడ్డు తవ్వి వదిలేశారు.. అధికారుల తీరుపై కాలనీవాసుల మండిపాటు





**తొలి అక్షరం/షాద్ నగర్,ఆగస్టు 19:** షాద్‌నగర్ పట్టణంలోని 26వ వార్డు శరణ బసవప్ప, ఇంద్రనగర్ కాలనీల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా వేసిన సీసీ రోడ్డును పైప్‌లైన్ కోసం తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కౌన్సిలర్ ఎస్పీ శివ పలుమార్లు మెగా పైప్‌లైన్ నిర్వాహకులకు సూచించినా పట్టించుకోవడం లేదన్నారు. ఒకటి, రెండు రోజులు పనులు చేసి సిబ్బంది తిరిగి రాకపోవడంతో పరిస్థితి అలాగే ఉందని తెలిపారు. సత్యసాయి పాఠశాల, ఆయుష్ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో విద్యార్థులు, రోగులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మెగా పైప్‌లైన్ నిర్వాహకులు, సంబంధిత అధికారులు స్పందించి పనులను వేగంగా పూర్తి చేసి తవ్విన రోడ్డును పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు: బీజేవైఎం
### షాద్‌నగర్‌లో బీజేవైఎం భారీ నిరసన.. బకాయిల విడుదలకు డిమాండ్




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు19:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో భారీ నిరసన, ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు షాద్‌నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ పుట్నాల సాయికుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అభినవ్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడిచినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా విద్యార్థుల పరిస్థితుల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాటల్లో కాకుండా విద్యార్థుల సమస్యల పరిష్కారంలోనూ చిత్తశుద్ధి చూపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, చెట్ల వెంకటేష్, శ్రీనివాస్‌చారి, ఉదయ్‌గౌడ్, అల్లం అనిల్, ప్రశాంత్‌గౌడ్, సూర్యగౌడ్, సుధాకర్ అప్ప, శివాజీ, వివేక్, శివ, శ్రీశైలం, యాదయ్య, అభిలాష్, శ్రీధర్, విజయ్, రామకృష్ణ, రావుల రాకేష్, చందుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# పెంజర్ల అంగన్వాడీ కేంద్రానికి స్వచ్ఛంద సంస్థ చేయూత

### అవేక్ష డేకేఆర్ సంస్థ ఆధ్వర్యంలో అంగన్వాడి భవనానికి మరమ్మతులు
### డిసిపి శిరీష,అవేక్ష డేకేఆర్ సంస్థ చైర్మన్ రేవతిని సన్మానించిన
### సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 19:** అంగన్వాడి కేంద్రాలను ప్లేస్కూల్ మోడల్గా మార్చేందుకు తమ సంస్థ సహాయ సహకారాలు అందిస్తోందని అవేక్ష డేకేఆర్ సంస్థ చైర్మన్ రేవతి అన్నారు. కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో అవేక్ష డేకేఆర్ సంస్థ చైర్మన్ రేవతి ఆధ్వర్యంలో అంగన్వాడి భవనంలో పలు మరమ్మత్తులు చేపడుతున్నామని ఆమె చెప్పారు. అనంతరం డిసిపి శిరీష,అవేక్ష డేకేఆర్ సంస్థ చైర్మన్ రేవతిని శాలువాతో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు ఆడుతూ పాడుతూ విద్యను అందించేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.సొసైటీ తరపున ఇప్పటి వరకు రాష్ట్రంలోని పలు అంగన్వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు,వివిధ రకాల వస్తువులు అందించామని తెలిపారు. కేంద్రంలోని పిల్లలు, టీచర్లు వాటిని సద్వినియోగం చేసుకుని పిల్లలకు మంచి విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగార్జున రెడ్డి,సెక్రటరీ గౌస్,వార్డ్ సభ్యులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# పదవి లేకుండానే ప్రభంజనం.. మునుగోడులో ఇఎల్వి. భాస్కర్ హవా

**● అధికార,ప్రతిపక్ష నాయకుల్లో దడ పుట్టిస్తున్న ఇఎల్వి. భాస్కర్ ● ప్రతి మండలం..ప్రతి గ్రామంలో అభిమానుల సందడి -జన్మదిన వేడుకలతో మరోసారి సత్తా చాటిన సేవా నాయకుడు ● ప్రాంతీయ,జాతీయ పార్టీల నుంచి ఆహ్వాన సంకేతాలా? ● భాస్కర్ రాజకీయ అడుగులపై మునుగోడులో ఆసక్తికర చర్చ**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు19:** మునుగోడు రాజకీయాల్లో ప్రస్తుతం ఒక పేరు హాట్‌టాపిక్‌గా మారింది. పదవి లేదు.. అధికార హోదా లేదు.. అయినా ప్రజల్లో మాత్రం తిరుగులేని ఫాలోయింగ్. సేవా కార్యక్రమాలనే ఆయుధంగా చేసుకుని ప్రజల మధ్య తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇ.ఎల్.వి. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇ.ఎల్.వి. భాస్కర్ ఇప్పుడు మునుగోడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు.ఇటీవల ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని మునుగోడు నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో, అనేక గ్రామాల్లో అభిమానులు, యువత, శ్రేయోభిలాషులు భారీ ఎత్తున వేడుకలు నిర్వహించడం రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించింది. కేవలం జన్మదిన వేడుకలకే పరిమితం కాకుండా రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు సహాయం, వైద్య సేవలు, ఇతర సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ప్రత్యేక చర్చకు దారితీసింది.

### అధికార, ప్రతిపక్ష నాయకుల్లో దడ పుట్టిస్తున్న ఇఎల్వి. భాస్కర్:

సాధారణంగా రాజకీయాల్లో పదవి ఉన్న నాయకుడి చుట్టూ కార్యకర్తలు, అనుచరులు కనిపిస్తారు. కానీ ఇ.ఎల్.వి. భాస్కర్ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఎలాంటి రాజకీయ పదవి లేకుండానే ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో ఆయన అభిమానులు స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహించడం రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.ఇదే ఇప్పుడు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల్లోనూ చర్చకు కారణమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భాస్కర్‌కు పెరుగుతున్న ప్రజాదరణ భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆయా పార్టీల నాయకత్వాలు ఆరా తీస్తున్నాయనే చర్చ నియోజకవర్గంలో వినిపిస్తోంది.

### విద్య.. వైద్యం..ఉద్యోగం-భాస్కర్ సేవా ప్రస్థానానికి మూడు మూలస్తంభాలు:

ఇఎల్వి. ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉద్యోగం అనే మూడు ప్రధాన అంశాలను కేంద్రంగా చేసుకుని సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.పేద విద్యార్థులకు అండగా నిలవడం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, యువతకు ఉద్యోగ అవకాశాల కోసం కృషి చేయడం వంటి కార్యక్రమాలతో భాస్కర్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన అభిమానులు పేర్కొంటున్నారు.

### గట్టుప్పల్‌లో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ..సేవా కార్యక్రమాలకు మరో నిదర్శనం:

జన్మదిన వేడుకల్లో భాగంగా గట్టుప్పల్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సైకిళ్లు అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టే ప్రతి అడుగు సమాజ భవిష్యత్తుకు పెట్టుబడే అనే ఆలోచనతో ఇ.ఎల్. వి. ఫౌండేషన్ ముందుకు సాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

### ప్రతి మండలంలో రక్తదాన శిబిరాలు.. జన్మదినానికి సేవా స్ఫూర్తి:

ఇ.ఎల్.వి. భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు మండలాల్లో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నారు. జన్మదినాన్ని వ్యక్తిగత వేడుకగా కాకుండా.. సమాజానికి ఉపయోగపడే రోజుగా మార్చడం భాస్కర్ అభిమానుల్లో కనిపించిన ప్రత్యేకతగా నిలిచింది.

### పదవి లేకుండానే ఇంతటి ఫాలోయింగ్ ఎలా?:

ఇదే ఇప్పుడు మునుగోడు రాజకీయాల్లో ప్రధాన ప్రశ్నగా మారింది.ఎలాంటి రాజకీయ పదవి లేకుండా.. ఎలాంటి అధికార బలం లేకుండా.. కేవలం సేవా కార్యక్రమాల ద్వారా ఇంతటి ప్రజాభిమానాన్ని సంపాదించుకోవడం సాధారణ విషయం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రత్యేకంగా యువత, విద్యార్థులు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వర్గాల్లో భాస్కర్‌కు పెరుగుతున్న ఆదరణ భవిష్యత్ రాజకీయ ప్రస్థానంపై ఆసక్తిని పెంచుతోంది.



### ప్రాంతీయ, జాతీయ పార్టీల చూపు భాస్కర్ వైపేనా?:

మునుగోడులో భాస్కర్‌కు పెరుగుతున్న ప్రజాదరణ నేపథ్యంలో ప్రాంతీయ, జాతీయ స్థాయిలో ఉన్న పలు రాజకీయ పార్టీలు కూడా ఆయనను తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు ఆసక్తి చూపుతున్నాయనే రాజకీయ చర్చ జోరందుకుంది.భాస్కర్ వంటి ప్రజాదరణ కలిగిన వ్యక్తి తమ పార్టీలోకి వస్తే నియోజకవర్గంలో పార్టీకి బలం చేకూరుతుందని ఆయా పార్టీల నాయకులు భావిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే ఏ పార్టీ నుంచి అధికారిక ఆహ్వానం వచ్చిందనే విషయంపై స్పష్టత లేకపోవడంతో దీనిని ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చగానే చూడాల్సి ఉంటుంది.అయితే ఈ పరిణామాలు భాస్కర్‌కు పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యతను మాత్రం స్పష్టం చేస్తున్నాయని ఆయన అభిమానులు చెబుతున్నారు.

### మునుగోడు బరిలో ఇఎల్వి. భాస్కర్ ఉంటారా?:

ఇప్పుడు మునుగోడులో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో ప్రశ్న ఇదే.రానున్న రోజుల్లో ఇ.ఎల్.వి. భాస్కర్ రాజకీయాల్లోకి వస్తారా?మునుగోడు నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలుస్తారా? ఏదైనా రాజకీయ పార్టీతో కలిసి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తారా?ప్రస్తుతం వీటిపై భాస్కర్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ఆయనకు లభిస్తున్న ప్రజాభిమానం మాత్రం రాజకీయ చర్చకు కొత్త ఊపునిస్తోంది.

### సేవతో సంపాదించిన బలం.. అభిమానులతో ఏర్పడిన అండ:

రాజకీయాల్లో పదవులు మారుతుంటాయి. పార్టీలు మారుతుంటాయి. కానీ ప్రజల కోసం చేసిన సేవలు, ప్రజల నుంచి వచ్చిన అభిమానం మాత్రం శాశ్వతంగా నిలిచిపోతాయి.ఇఎల్వి. భాస్కర్ విషయంలో కూడా అదే జరుగుతోందని ఆయన అభిమానులు అంటున్నారు.విద్యార్థులకు అండగా..పేదలకు సహాయకారిగా..వైద్య సేవల్లో భరోసాగా..

### యువతకు ఉద్యోగ అవకాశాల కోసం తోడుగా..

సామాజిక సేవలో ముందుండే వ్యక్తిగా..ఇ.ఎల్.వి. భాస్కర్ తనకంటూ ప్రత్యేకమైన ప్రజా సంబంధాలను ఏర్పరుచుకున్నారని వారు పేర్కొంటున్నారు.

### జన్మదిన వేడుకలా? భవిష్యత్ రాజకీయ శక్తికి సంకేతమా?:

మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో దాదాపుగా కనిపించిన ఇ.ఎల్.వి. భాస్కర్ జన్మదిన వేడుకలు ఇప్పుడు ఒక సాధారణ కార్యక్రమం కంటే ఎక్కువగా రాజకీయ చర్చకు కారణమయ్యాయి.పదవి లేకుండానే ఇంతటి ప్రజాభిమానం..ప్రతి మండలంలో అభిమానుల సందడి..యువతలో పెరుగుతున్న ఆదరణ..ప్రాంతీయ, జాతీయ పార్టీల నుంచి వస్తున్న ఆహ్వాన సంకేతాలపై చర్చ..ఇవన్నీ కలిపి చూస్తే మునుగోడు రాజకీయాల్లో ఇ.ఎల్.వి. భాస్కర్ పేరు భవిష్యత్‌లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




### మునుగోడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు భాస్కర్ కేంద్రబిందువవుతారా?:

ప్రస్తుతం ఆయన సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ, అభిమానుల ఉత్సాహం, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలు మాత్రం ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సేవా కార్యక్రమాలతో ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్న ఇ.ఎల్.వి. భాస్కర్.. రేపటి రాజకీయాల్లో ఏ పాత్ర పోషిస్తారో వేచి చూడాల్సిందే.

### మునుగోడు రాజకీయాల్లో ప్రస్తుతం వినిపిస్తున్న ఒకే ప్రశ్న?

పదవి లేకుండానే ప్రజల్లో ఇంతటి ప్రభంజనం సృష్టించిన ఇఎల్వి. భాస్కర్.. రానున్న రోజుల్లో రాజకీయ బరిలోకి దిగితే పరిస్థితి ఎలా మారుతుంది? సమాధానం భాస్కర్ నిర్ణయంలోనే ఉంది.. కానీ ఆయనపై మునుగోడు ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి మాత్రం ఇప్పటికే స్పష్టమైంది.

# రవీంద్ర జడేజా సరికొత్త చరిత్ర..

శ్రీలంకతో గాలే అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన జడేజా, టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. ప్రస్తుతం ఐసీసీ పురుషుల టెస్ట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న జడేజా, మూడో రోజు ఆటలో లంక బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి ఈ అరుదైన ఫీట్‌ను అందుకున్నాడు. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు సోమవారం ఉదయం సెషన్‌లో శ్రీలంక టెస్ట్ కెప్టెన్ ధనంజయ డి సిల్వాను ఔట్ చేయడం ద్వారా జడేజా తన వికెట్ల ఖాతాను తెరిచాడు. అనంతరం మూడో సెషన్‌లో కేశర నువాంత వికెట్‌ను పడగొట్టి తన టెస్ట్ కెరీర్‌లో 350 వికెట్ల మైలురాయిని లాంఛనంగా అధిగమించాడు. 2012లో టీమిండియా తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేసిన జడేజా, గాలేలో తన 90వ టెస్ట్ మ్యాచ్ ఆడుతూ ఈ ఘనత సాధించడం విశేషం. టెస్ట్ క్రికెట్ చరిత్రలో భారత్ తరఫున 350 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టిన ఐదో బౌలర్‌గా జడేజా రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 619 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు (1990-2008 మధ్య 132 టెస్టులు). కుంబ్లే తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (537 వికెట్లు), కపిల్ దేవ్ (434 వికెట్లు), హర్భజన్ సింగ్ (417 వికెట్లు) ఉన్నారు. ఇప్పుడు వారి సరసన జడేజా సగర్వంగా నిలిచాడు. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా, ఆల్ రౌండర్‌గానూ జడేజా ప్రపంచ స్థాయి రికార్డును నెలకొల్పాడు. టెస్టుల్లో 4,000 కంటే ఎక్కువ పరుగులు చేసి, 350కి పైగా వికెట్లు తీసిన ప్రపంచంలోనే నాలుగో క్రికెటర్‌గా, భారత్ తరఫున దిగ్గజం కపిల్ దేవ్ తర్వాత రెండో ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచ క్రికెట్




చరిత్రలో ఈ ఘనత సాధించిన దిగ్గజాల జాబితాలో.. కపిల్ దేవ్ ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. అతడు 131 టెస్టుల్లో 5,248 పరుగులు, 434 వికెట్లు సాధించాడు. ఇయాన్ బోథమ్ (ఇంగ్లాండ్).. 102 టెస్టుల్లో 5,200 పరుగులు, 383 వికెట్లు.. డేనియల్ వెట్టోరి (న్యూజిలాండ్).. 113 టెస్టుల్లో 4,531 పరుగులు, 362 వికెట్లు.. రవీంద్ర జడేజా (భారత్).. 90 టెస్టుల్లో 4,108 పరుగులు.. 350ం వికెట్లు జూన్ 2026లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు ఎంపిక కాని జడేజా, లంకతో సిరీస్‌లో తిరిగి జట్టులోకి వచ్చి సత్తా చాటాడు. ఇప్పటివరకు 134 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో 4,108 పరుగులు పూర్తి చేసిన జడేజా, ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 13 పరుగులు చేశాడు. తాజా ప్రదర్శనతో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడిగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు.



# అనుకున్న సమయానికే స్పిరిట్ విడుదల

**- వాయిదా వార్తలను ఖండించిన టీమ్**

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ – వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. 'స్పిరిట్' షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. 'స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పు లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని క్లారిటీ ఇచ్చింది. ఈ మూవీలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

# 24న మహాకాళి ఫస్ట్ గ్లింప్స్



పాన్ ఇండియా స్థాయిలో సంచలనాలు సృష్టించిన 'హనుమాన్' చిత్రంతో 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'కు శ్రీకారం చుట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, ఇప్పుడు మరో భారీ విజువల్ వండర్‌కు సిద్ధమయ్యారు. పీవీసీయూ నుంచి వస్తున్న తన తదుపరి భారీ చిత్రం 'మహాకాళి' చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటనను తాజాగా వెల్లడించారు మేకర్స్. 'ది ఎండ్ బిగిన్స్' అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఆగస్టు 24న ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేయబోతున్నట్లు ప్రశాంత్ వర్మ ప్రకటించాడు. ఇక ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ సృష్టికర్తగా వ్యవహరిస్తుం డగా, పూజ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ దుగ్గల్ ఈ చిత్రాన్ని ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, భూమి శెట్టి ప్రధాన టైటిల్ పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు శ్రీయారెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాజేష్ బేడి, పోసాని మురళీ శర్మ, నాజర్, రజత్ కపూర్ వంటి ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. మైథలాజికల్ సూపర్‌హీరో జోనర్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సురేశ్ రఘు సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీనాగేంద్ర ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. హనుమాన్ సినిమాతో సూపర్‌హీరో కాన్సెప్ట్‌ను పరిచయం చేసిన ప్రశాంత్ వర్మ, 'మహాకాళి'తో ఏ స్థాయి విజువల్ ట్రీట్ ఇస్తారోనని సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వియత్నాం టూర్‌లో సమంత, రాజ్ నిడుమోరు



టాలీవుడ్ స్టార్ నటి సమంత ప్రస్తుతం వియత్నాంలో తన భర్త, ప్రముఖ దర్శక-నిర్మాత రాజ్ నిడిమోరు తో కలిసి బేబీమూన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే తాము మొదటి బిడ్డకు స్వాగతం పలకబోతున్న నేపథ్యంలో, ఈ ప్రత్యేకమైన క్షణాలను ఆస్వాదించేందుకు ఈ క్యూట్ కపుల్ వియత్నాం వెకేషన్‌కు వెళ్లారు.అక్కడి సుందరమైన ప్రదేశాలను చుట్టేయడంతో పాటు, పలు రకాల ఫన్ యాక్టివిటీస్‌లో సమంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే అక్కడి ప్రత్యేకమైన స్థానిక ఫుడ్‌ను టేస్ట్ చేస్తూ ఎంజాయ్ చేసిన వీడియోలు, ఫోటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ బేబీమూన్ పిక్స్ మరియు వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా, టాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.




# టాక్సిక్ .. పెద్దల సినిమా మాత్రమే

**- పిల్లలు చూడొద్దన్న నటుడు యశ్**

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్ యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం' అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం' అని యశ్ అన్నారు.

# రాకాలో హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బ్జడెట్ మూవీ 'రాకా'. హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా 'రాకా'లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే 'రాకా' భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# ఓటిటిలోకి శ్రీనివాస మంగాపురం

తెలుగు సినీ పరిశ్రమలోకి సూపర్ స్టార్ కృష్ణ మూడో తరానికి చెందిన వారసుడిగా ఘనంగా అడుగుపెట్టారు జయకృష్ణ ఘట్టమనేని. దివంగత నటుడు రమేష్ బాబు తనయుడైన జయకృష్ణ హీరోగా, బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ నూతన నాయికగా టాలీవుడ్‌కు పరిచయమైన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. వైవిధ్యమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ రొమాంటిక్ యాక్షన్ అండ్ రస్టిక్ డ్రామా ఇటీవలే థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శించ బడుతోంది. అయితే ఈ సినిమా వచ్చి 20 రోజులు కూడా కాకముందే సినిమా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకున్నారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ద్వారా ఆగస్టు 20 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు అత్యంత కీలకమైన పాత్రలో నటించగా, కోలీవుడ్ మ్యూజిక్ సెన్సేషన్ జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రతిష్టాత్మక వైజయంతి మూవీస్ సంస్థ సమర్పించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే



ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ.